# 'కొత్త నీరొచ్చి...'




- జి.ఎల్. శారద.

టైం రాత్రి తొమ్మిదిన్నరయింది.

'నిశ్చింత్' ఎపార్ట్‌మెంట్స్‌లో అధునాతనంగా సర్ది వున్న డ్రాయింగ్ రూంలో ఖరీదైన సోఫాలో కూర్చున్న కరుణ మదిలో మెదులుతున్న చింత, ఒక వింతైన భయం. అది ఆమె పిల్లలిద్దరి పట్ల గల ప్రేమ, అనురాగం, బాధలు కలబోసి వువ్వెత్తున ఎగిసి పడుతున్న భావతరంగం. కరుణది నిజానికి ఎంతో సుఖమయమైన జీవితం. ప్రేమవివాహం. అనుకూలమైన దాంపత్యం. రత్నాల్లాంటి బిడ్డలు, ధనకనక వస్తువాహనాలకేమీ లోటులేదు. మరి ఆమె పడే ఆవేదనకి కారణమేమిటి? ఆలోచనదేని గురించి?

2005 రామాకవితల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవిత.

## నేను పిచ్చివాడిని

నేనొక పిచ్చివాడిని
స్నేహ తత్వ మెరిగినా
స్నేహాన్ని స్నేహించె పిచ్చివాడిని
స్నేహం మోసగించటానికి ఒక ఆయుధం
ఎదుటి వాడిని ఓడించటానికి బ్రహ్మాస్త్రం
స్నేహమొక సన్నాయి
శ్రావ్య రాగాలు పలికే సన్నాయి
పిల్లలని గంగిరెద్దులుగా ఆడించటానికి
తల్లి దండ్రులకదొక సన్నాయి
స్నేహమంటె తోబుట్టువులకు
నిరంతర సేవ
జీవిత భాగస్వామికి, స్నేహం
ఒక వంతెన,
ఇటు రాక కోసం
వాడని వంతెన,
ఇమ్మనే నోటితోనే
పొమ్మనే స్నేహం పిల్లలది
నాకు తెలుసు
స్నేహతత్వం ఇదేనని
ఐనా,
నేను స్నేహాన్ని స్నేహిస్తున్నాను
ఎందుకంటె
స్నేహపూర్ణిమ లేని బ్రతుకు
చమురు లేని భూగోళం
అందుకె
నేనొక పిచ్చివాడిని
స్నేహ తత్వమెరిగినా
స్నేహాన్ని స్నేహించె పిచ్చివాడిని

**- ఎల్.ఆర్.స్వామి**

చిన్నప్పట్నుంచీ కావలసినవన్నీ స్వయం కృషితో పట్టుదలతో సాధించుకునేది. భర్తకి బిజినెస్‌లో తగురీతిగా సహకరించేది. ఆర్థిక సమస్యల్ని, ఉమ్మడి కుటుంబంలోని చిన్న చిన్న కలతల్ని నేర్పుగా పరిష్కరించుకుంది.

కూతురు కవితకి కొడుకు తరుణ్‌కీ తన పేగునేకాక పేరునికూడా చీల్చి పంచియిచ్చింది. మంచి విద్యాబుద్ధులు చెప్పించి, సొసైటీలో ఉన్నత స్థాయిలో నిలబెట్టింది.

కాని యీ మధ్యనే ఎందుకో వాళ్ళ ప్రవర్తన చూసి ఆమె మనస్సు ఆందోళన చెందుతోంది.

అధునాతనమైన వస్త్ర ధారణ వారి అందచందాలని తగ్గించినట్లనిపిస్తోంది. సమయం విలువ గ్రహించకుండా ఆలస్యంగా నిద్ర లేవడం చూస్తే వారి కాలంలో నెగ్గుకు రాలేరేమో అనిపిస్తుంది. పెద్దలమాట వినక పోవడం, గౌరవించకపోవడం నిర్లక్ష్యంగా మాట్లాడే వారి భాష చూస్తే మానవతా విలువలని విస్మరించి ప్రవర్తిస్తున్నట్టుంటుంది. ఎక్కడ జరిగిందీ పొరపాటు?

తరాలఅంతరాలు,అంటే జనరేషన్ గాప్ చేసే గమ్మత్తుల మత్తే యిది. ఆలోచనలతో తల దిమ్మెక్కుతోంది. ఓ తలనొప్పి మాత్ర వేసుకుని టీ తాగాలని లేవబోయింది. బద్ధకంగా అనిపించి మళ్ళీకూర్చుని కళ్ళు మూసుకుంది.

ఇంతలో కారు హారన్ వినిపించింది.

బూట్లు టకటకలాడించు కుంటూ లోపలికొచ్చింది కవిత.

బాబ్‌కట్ హెయిర్, గాగుల్సు పెట్టు కుని హ్యాండ్ బ్యాగ్ ఒక చేతిలోను కీచైన్ మరో చేతితో త్రిప్పుతూ, తలవూపుతూ ఏదో పాట కూనిరాగం తీస్తూ తల్లిని చూసిందో లేదో గాని మేడ మెట్లు ఎక్కుతోంది.

రెడ్ టీ షర్టు, బ్లూ జీన్స్ ప్యాంటు, నైక్ షూ వేసుకుని, వాక్‌మన్‌లో పాట వింటూ మరో సోఫాలో కూర్చున్నాడు తరుణ్ వాడి ధ్యాసంతా విం టున్న పాటమీదే వుంది. ఇద్దరూ తన ఉనికిని గుర్తించి నట్టే లేరు. కరుణకి ఒళ్ళు మండింది. ఆడ పిల్ల గనక ముందు కవిత మీద మరల్చింది తన దృష్టిని. 'ఏమిటి యింత ఆలస్యమైంది కవితా' మూవీకెళ్ళాము. థ్రిల్లింగ్‌గా వుంది. చాలా ఎంజాయ్ చేశాం. వస్తుంటే 'పీజా' కార్నర్‌లో తరుణ్ కనబడ్డాడు. నేనూ వాడు కలిసేవచ్చాం'.

'అంటే వాడు మూవీకి రాలేదా?' 'లేదు' 'మరి నువ్వెవరితో వెళ్ళావు? 'ఓ! మమ్మీ అది అంత అవసరమా' అంది విసుగ్గా 'అవును నాకు అవసరమే నువ్వు ఆడపిల్లవి ఆ విషయం నువ్వు మరిచిపోయినా నేను ఎలా మరవగలను?'

'సరే, చెబుతా విను. మా కొలీగ్ ఒకతనికి ట్రాన్స్‌ఫర్ అయిందని మేం పార్టీ యిస్తే అతను మూవీకి తీసుకెళ్ళాడు'.

'మరి ఆ సంగతి నాకు చెప్పొచ్చుగా' అంది కరుణ తీక్షణంగా చూస్తూ' ' నాసెల్ ఫోను మర్చిపోయాను ఆఫీసులో. అయినా యింత కంగారు పడతావనుకోలేదు. అసలు నన్నింత నిలదీస్తున్నావు గాని తరుణ్‌ని ఏమీ అనవేం వాడూ యిప్పుడే వచ్చాడుగా?' అంది కవిత కొరకొర చూస్తూ.

'అబ్బా మమ్మీ ఇంటికి రాగానే యీగోలేంటి? అన్నాడు తరుణ్

'అవునురా నా మాటంటేనే నీకో గోలగా వుంటుంది. ఇంటిదగ్గర నేనొకదాన్ని వున్నానని మీకోసం చూస్తూ వుంటానని మీ కనిపించదు. నేను మీకు డోర్‌మ్యాట్‌తో సమానం అవునా'కరుణ కంఠం జీరబోయింది.

'అది కాదు మమ్మీ అర్ధరాత్రయితే భయపడాలిగాని... అయినా అసలు డాడీ నీకు కంపెనీ యివ్వాలి లేకపోతే మమ్మల్నిలాగే విసిగిస్తావు'

'ఆయన పని తెమిలి వచ్చేసరికి నేను సగం నిద్రలో వుంటాను. నా గురించి ఆయన, ఆయన గురించి నేను ఆలోచించం, మా ఆలోచన అంతా మీ మీదే'

'మేమింకా పసిపిల్లలమా? మా గురించి నీ ఆరోగ్యం పాడుచేసుకోకు అసలు మా ఫ్రెండ్స్ తలిదండ్రులు వాళ్ళని గురించి అసలు పట్టించుకోనే పట్టించుకోరూ' అంటూ

సాగదీశాడు తరుణ్.

'సరేలే నా ప్రారబ్ధం అనుకుంటాను. మీరు మాత్రం మారరు. పదండి భోజనానికి'. కడుపు నిండుగా వుందని పిల్లలు తినలేదు. వీరి సంభాషణలో అలసిపోయిన కరుణకి కూడా ఆకలి చచ్చిపోయింది.

✷ ✷ ✷

మర్నాడు సూర్యోదయం అవుతుండగానే ఇంటిముందో ఆటోరిక్షా ఆగింది. లగేజి దింపుతున్నాడు, కరుణ మేనమామ మాధవయ్య అతని భార్య మీనాక్షి సామానులెక్క చూస్తోంది.

వాళ్ళని చూడగానే కరుణమొహం సంతోషంతో విప్పారింది.

'రండి మామయ్యా, రా అత్తయ్యా! ఎన్నాళ్ళయింది. మిమ్మల్ని చూసి? అంటూ వెంకన్నా సామాను గెస్ట్ రూంలో పెట్టు' అంది.

'అవునే అమ్మాయి దాదాపు ఇరవై ఏళ్ళవుతోంది. మీ పెళ్ళయిన కొత్తలోనే మేం ఢిల్లీలో స్థిరపడిపోయాం. అసలు ఆంధ్రా వైపు రాలేదు' అన్నాడు మామయ్య. ఏదో తప్పు చేసిన వాడిలా మొహం పెట్టి.

'మరిప్పుడు గాలి యిటు మళ్ళిందేం'? అంది నవ్వుతూ. ఆమె గొంతులో సంతోషం పొంగుతోంది. మనసారా మాట్లాడుకోడానికి మనుషులు దొరికారని. 'కర్మ తల్లీ, మేం చేసుకున్నది. పూర్వ జన్మలో ఏం పాపం చేశామో!' ఫలితం అనుభవిస్తున్నాం. కట్టు బొట్టుయేకాదు ఆలోచనలు, ఆచారాలు, వంటలు, పంటలు, పండుగలు పబ్బాలు అన్నీ వేరే అక్కడ మను ష్యుల మనస్సు కుంచించుకుని పోయి యిరుకై పోయింది. అంత కంతా కుళ్ళు కృత్రిమాలు పెరిగి పోయాయి. సొంతం అనుకునేం దుకు ఏమీ లేదక్కడ' అత్తయ్య తన ధోరణిలో మాట్లాడేస్తోంది.

'అది సరే మరిప్పుడు, ఇన్నాళ్లకి కొత్తగా వచ్చిన మార్పేంటి? మీరెందు కింత పెద్దనిర్ణయం తీసుకున్నారు?'

'ఏమీ లేదమ్మా మన వాళ్ళందరి నట్టనడాన మా చివరి రోజులు గడుపుదామని. ఆదరణ ఆప్యాయతలు కరువైన చోట వుండలేమనిపించింది. అయినా అక్కడ మా అవసరం కూడా కొడుక్కి కోడలికి తీరి పోయింది' అన్నారు మామయ్య గంభీరంగా.

'బాగ్ బాన్' సినిమాలో 'అమితాబ్ బచ్చన్','హేమమాలిని'పాత్రలు గుర్తుకొచ్చాయి.

'అదేమిటి స్వంత పిల్లలు అంత పరాయి అయిపోయారా?"

'అలాగని మేమను కోవట్లేదు. వాళ్ళకే అలా వుంది. ఏ రోజూ పార్టీలు ఫ్రెండ్స్, వీడియో సినిమాలు, కంప్యూటర్ ఛాటింగ్‌లు, వీటితోనే సరి పోతుంది. మాతో మాట్లాడే తీరిక, సమయం వాళ్ళకి వుండదు. మొదట్లో మేం వంటపని, యింటిపని, తోటపని చేస్తే ఎంతో గొప్పగా చెప్పేవారు మా గురించి మాకు శక్తి తగ్గింది కదా! ఇప్పుడు అవే పనులు వాళ్ళకి గిట్టట్లేదు. ఏదో విసుగు, కోపంతో సూటీ పోటీ మాటలంటుంటే భరించలేకపోతున్నాం. మా విలువ తగ్గి పోయింది, మా అహం దెబ్బతింది. వాళ్ళు తన్ని తగలెయ్యక ముందే బయటపడితే చాలని యిక్కడికి వచ్చాం' అంది అత్తయ్య.

'పోనీలే మంచిపని చేశారు మా దగ్గరే వుండిపోండి.

మీకే కష్టం కలగకుండా నేను చూసుకుంటాను!

'మమ్మీ యీ వయస్సులో నువ్వు వీళ్ళకి సర్వీసు చెయ్యగలవా? మమ్మల్ని మాత్రం సాయం చెయ్యమనకు' అన్నారు. యీ విషయం తెలిసిన కవిత, తరుణ్‌లు.

'మీకే భాధ్యత పెట్టను సరేనా? వృద్ధ జనసేవ ఎంతో పుణ్యమైనది తెలుసా' అంది కరుణ గర్వంగా.


'అసలు నిన్నే మా కోడలుగా చేసుకోవలసింది. ఆ రోజుల్లో మా అబ్బాయి బెంగాలీ పిల్లని పెళ్ళి చేసుకుంటానంటే సరేనని పెళ్ళి చేశాం. అది కాస్తా ఓ కొడుకుని కని విడాకులిచ్చేసింది. కొడుకుని తీసుకెళ్ళిందిలే. ఒంటరిగా ఎన్నాళ్ళుంటాడని మన తెలుగు పిల్లనే యిచ్చి మళ్ళీ పెళ్ళి చేశాం. అయితే దాని కదేం తెగులో మేమంటేనే గిట్టదు. వాడితో మాట్లాడనివ్వదు. అపరకాళికావతరమే అనుకో" అత్తయ్య చెప్పే సమాధానం చూస్తే.

'ఛీ ఇంత అమానుషంగా ప్రవర్తిస్తుందా?'అనిపించింది కరుణకి. ఆమె మనస్సు కరిగిపోయింది. ఫలితం, వాళ్ళు ఆమె దగ్గర ఉండి పోయారు.

✷ ✷ ✷

కొన్నాళ్ళు అందరికీ బాగానే వుంది. కానీ తరువాత 'బ్రహ్మకైన పుట్టు రిమ్మతెగులు' అన్నట్లు మారింది వాతావరణం. 'కాఫీ యిస్తావా అమ్మా?' 'వంట రెడీ అయిందా' 'అలా పార్కుదాకా వెళ్ళి వస్తామే తల్లీ' అంటూ వాళ్ళ అవసరాలు సరదాలు తీర్చుకుంటున్నారే గాని, వృద్ధదంపతులు 'ఏమైనా సాయం చెయ్యాలా?' 'ఏదైనా తెచ్చి పెట్టమా' అని అడిగే పద్ధతే లేదు. 'పెద్దవాళ్ళమైపోయాం' అంటున్న వాళ్ల మూల్గులు వింటుంటే నిజంగా కష్టపడి పోతున్నట్లు అనిపిస్తుంది చూసే వాళ్ళకి. మరో నాల్గునెలల్లో యింకా వింతమార్పులు వచ్చాయి.

'పక్క దుప్పటి సరిగా వేయలేదని, కాళ్ళు పట్టడానికి పిలవంగానే రావట్లేదని పని వాళ్ళ మీద నేరాలు చెప్పడం, అక్కర్లేని అజమాయిషీ చెయ్యడం ఎక్కువైంది. ఇంట్లో సౌకర్యంగా లేదని, కవిత తరుణ్‌ల ప్రవర్తన మీద వ్యాఖ్యానించడం వింతగా



అనిపించేది. ఆఖరికి 'నోట్లో నాలుక లేనిదని కరుణని నలుగురిలో చిన్నబుచ్చడంతో మళ్ళీ కరుణ మనస్సు కలత చెందింది.

'అరబ్బీ వాడు, ఒంటె' కథ గుర్తొచ్చింది. తన యిల్లే తనకి పరాయి స్థలంగా మారినట్లుంది. 'అంత్య నిష్టూరంకంటే ఆది నిష్టూరమే మేలన్న సామెత నిజమనిపిస్తోంది. దీనికి పరిష్కారమేమిటి? స్వయం కృతాప రాధం' కనుక మింగలేక కక్కలేక పరిష్కారంకోసం భగవంతునిపై భారం వేసి కాలం గడుపుతోంది.

* * *

ఓరోజు కవిత తరుణ్ గార్లెండ్స్ స్వీట్స్ పట్టుకొచ్చి ఇంట్లో వారందర్నీ డ్రాయింగ్ రూంలో సమావేశపరచారు. 'వెల్‌కం టు యూ ఆల్' ఈ రోజునుంచీ మనందరి జీవితాల్లో మంచి మార్పు రాబోతోంది. మనం దరమూ ఆనందంగా జీవితాన్ని గడిపేసమయం వచ్చింది అంటూ ఉత్సాహంగా మాట్లాడాడు తరుణ్. 'ఏమిటీ లాటరీ ఏమైనా తగిలిందా?' అన్నారు మాధవరావుగారు, మీనాక్షి. ఎంత పెద్ద వాళ్ళైనా ధనవ్యామోహం వదల్లేదు వారిని 'పెళ్ళి కుదిరిందా?' అన్నారు తలిదండ్రులు, అవును వారి ఆతృత వారిది.

'విదేశీయానమా' అన్నారు నాటకీయంగా వంట మనిషి రాము. వాడి ఆశలు పాపం ఎప్పుడూ ఆకాశంలోనే వుంటాయి గదా. 'స్టాప్... స్టాఫ్! మీరు గెస్ చెయ్యలేరు మేమే చెబుతాం' అంటూ కవిత హ్యాండుబ్యాగ్ లోంచి ఒక కవరు తీసింది. 'తాతగారూ, బామ్మ గారూ మీకు మేమందించే బహుమానం యిది. అన్ని సౌకర్యాలు గల 'హోం ఫర్ ద ఏజ్డ్' అదే వృద్ధాశ్రమంలో మీ కయ్యే ఖర్చు కూడా ఒక సంవత్సరానికి కట్టి ఎడ్మిషన్ చేయించాం. జస్ట్ ఒక హాస్టలులాగా వుంటుంది. మీ సమవయస్కులతో మీరు సంతోషంగా గడపవచ్చు. మీ అనుభవాలు వారితో పంచుకుని మీకాలం సద్వినియోగం చేసుకోండి'అంటూ ఆ కవరు వారికందించింది.

'ఏంటీ! మమ్మల్ని యింట్లోంచి వెళ్ళగొడ్తారా?'అంటూ రుసరుసలాడారు వాళ్ళు.

'మీకు సౌకర్యంగా లేని యింట్లో మీరెందుకండీ వుండడం? అక్కడ మీకు ప్రశాంతంగా వుంటుంది. మీరెప్పుడు కావాలన్నా రావచ్చు ఇక్కడికి, మా సహాయం తీసుకోవచ్చు. మీ శేషజీవితం హాయిగా గడపండి. మరి పదండి' అంటూ తొందరపెట్టాడు తరుణ్.

కరుణకి ఒకవైపు బాధగావున్నా సమస్య సామరస్యంగా పరిష్కరించబడిందని సంతోషపడింది.

'మమ్మీ' అంటూ తరుణ్ కరణవైపు తిరిగాడు. కరుణ కంగారుపడింది ఏదో బాంబు పేలినట్లు. 'ఏమిటిరా నాకు గూడా ఏదైనా హోం చూశావా?'

'ఛీ ఏంటి మమ్మీ అలా అంటావు? నువ్వు, డాడీ ఎంజాయ్ చేసే టైమిది. మీకు ఒక నాలుగు నెలల పాటు మార్పు వుంటుందని 'వరల్డ్ టూర్'కి టికెట్లు తెచ్చాం. ట్రావెల్ ఏజంటు అన్ని ఏర్పాట్లు చేశాడు. ఈ టికెట్టు (e.Ticket) తీసుకుని హాయిగా గడిపిరండి! అంటూ పిల్లలిద్దరూ కరుణ కళ్ళల్లోకి ఆప్యాయంగా చూశారు. షాక్ తింది కరుణ.

"మిమ్మల్ని, మీ స్పీడుని నేను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాను. తరాల అంతరం (కమ్యూనికేషన్ గ్యాప్) వల్ల అనేక మనస్పర్థలు వస్తున్నాయి. మనమధ్య దూరాన్ని పెంచుతున్నాయి. మీకు తెలీనివెన్నో వున్నాయని బాధపడ్డానే గానీ మీకు తెలిసినవి ఎన్నెన్నో వున్నాయని గ్రహించలేకపోయాను. నేను నా పెద్దరికాన్ని మర్చిపోయి అనవసరంగా ఆందోళనపడ్డాను. కొత్త నీరొచ్చి పాతనీటిని కొట్టివేసిందన్న సామెత కరెక్ట్ అనిపిస్తోంది. లేకపోతే పాత నీరు పాకుడు పట్టి దుర్వాసన పుట్టి అంతా గందరగోళమవుతుంది. సీ వీడ్స్ (నీటి కలుపు మొక్కల)ని పెరగనివ్వకూడదు. అలాగే పిల్లలకి ఆనందాన్నే పంచాలి గాని అడ్డు రాకూడదు. విమర్శించడం, మందలించడం వంటివి నిరాశ నిస్పృహలని కలిగిస్తాయి అని తెలుసుకున్నాను. ఇంక నేను నా పెద్దరికం నిలబెట్టుకునే లాగే ఆలోచిస్తాను ప్రవర్తిస్తాను. నౌ అయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యూ".

'దట్స్ రియల్లీ గ్రేట్ మమ్మీ మనం మంచిస్నేహితులుగా వుంటూ సంతోష సంబరాలు పంచుకుందాం అంటూ ఆమెని చుట్టేశారు పిల్లలు.

'నిశ్చింత్' అపార్ట్‌మెంట్ పేరు సార్థకమైంది.

## నానీలు - నాలుగు విరజాజులు

కొండవీటి చాంతాడంత
కవిత కాదు.
సైతక పరమాణువును
సుందర శిల్పంగా మలచడం
సునిశిత పనితనం కదా !
దేని అందం దానిది.
కవిత్వానికి క్రైటీరియా
సైజూ బరువు కాదయా
అన్నాడు మహాకవి.
అల్పాక్షరాలతో
అనల్పార్థ రచన
ఏనాడో అన్నాడు మరోకవి !
సూక్ష్మంలో మోక్షం
చూపించే గవాక్షం.
సాహిత్యం ఓ సామాజిక సత్రం
అంత మాత్రానికే అంటగట్టాలా
వ్యక్తిగత గోత్రం.
అక్షరంలో ఆర్ద్రత
అభివ్యక్తిలో స్పష్టత
నానీల గుణం
లేకుంటే ఇంతలా
చలింపజేసేదా?
ఇందరిని ఇంతలా
జ్వలింపచేసేదా?
అమ్మా ! కవితా !
'నానీ' నీ కడుసుత
'పాలి'చ్చి పెంచావు.
పరిపాలిస్తున్నావు !
విరజాజులు నాలుగైనా
హృదయాన్ని
పరిమళభరితం చేస్తాయి
అక్షరాలు కొన్నైనా
నానీలు - మనసును
వ్యాకోచింపచేస్తాయి !

**- గరికపాటి మణీందర్**

సాంకేతిక కారణాల వలన రెగ్యులర్ శీర్షికలు ఇవ్వలేకపోతున్నాం

\- ఎడిటర్